"చక్రవర్తి' మాసపత్రిక కథలపోటీలో బహుమతి పొందిన కథ

# సశేషం

చిత్రాన్ని ముగించి ఫైనల్ టచింగ్స్ అవసరముందేమో నని పరీక్షించే చిత్రకారుడిలా వెంటతెచ్చుకొన్న సామాను చేత్తె సంతలో సర్ది తృప్తిగా ఓసారి గదంతా కలయజూశాను.

"బాబూ! ఈ గదిలోకి క్రొత్తగా వచ్చినట్లున్నావ్?"

వచ్చి మూడు గంటలైనా కాకుండానే ఈ చుట్టమెవరాని తలెత్తిచూసి, "అవునండి!" అన్నా చిరునవ్వుతో అసంకల్పితంగా.

ముగ్గుబుట్టలా వున్న తల వెంట్రుకలు, స్నేహభావ ముట్టిపడే కళ్ళు, ముఖంలో వార్ధక్యపు ఛాయలు.

"నిలబడే వున్నారేం? కూర్చోండి!" అన్నాను చేత్తో కుర్చీ చూపి.

"ఫరవాలేదు బాబూ!" అంటూనే కూర్చొని "ఏవూరు? ఏం ఉద్యోగం చేస్తున్నావ్?" గదంతా కలయజూస్తూ అడిగారు.

గుంటూరని, ఇ.సి.ఐ. యల్‌లో మొన్నీమధ్యనే వుద్యోగం వచ్చిందని చెప్పి ఆయన గూర్చి వివరాలడిగాను సభ్యతకోసం.

"రామనాథం అనబడే ఈ తల పండిన వాడితో పనిలేదని ప్రభుత్వం రిటైర్ చేసింది. తలపండినా అవసరాలుంటాయి గనుక పెన్షన్ చాలక, తక్కువ జీతం చాలని ఎక్కువ గంటలు పనిచేసే నాలాంటి వాళ్ళకోసం వుద్యోగాలున్న ఓ కొట్లో గుమాస్తాగా ఇరుక్కున్నాను." అంటూ నవ్వి. "నీకు పెళ్ళి కాలేదను కొంటాను" అన్నారు.

కొంపదీసి ఎదిగిన కూతురిపెళ్ళి చెయ్యలేక ఇంట్లో పెట్టుక కూర్చొన్న ఆడపిల్లల తండ్రికాదు కదాని అదిరిపడ్డాను.

ఆయన గలగల నవ్వుతూ "నా కూతుర్ని నీకు కట్టబెట్టే ప్రయత్నంలో వచ్చాననుకొన్నావేమో! నాకసలు ఆడపిల్లలే లేరు గనుక నా నుండి నీకెట్టి ప్రమాదం లేదని హామీ ఇస్తున్నాను" అన్నాడు.

నా ఆలోచనకు వేనే సిగ్గుపడి, "అబ్బే! లేదండి! నాకింకా పెళ్లికాలేదు. ఇప్పట్లో చేసుకోవాలనీలేదు." అన్నాను నవ్వు తెచ్చుకొని.

"నీ ఆలోచన మంచిదే. ఈ కాలం కుర్రాళ్ళకు మీసం మొలవ గానే వచ్చే మొదటి ఆలోచన పెళ్ళిగురించే. స్థిరత్వం రాకుండానే పెళ్ళాడి పెళ్ళాన్నేం చేసుకొంటారు?" మళ్ళీ బిగ్గరగా నవ్వు.

"మా వాడికి కూడా అప్పు నీలాంటి వుద్దేశాలే! ఉద్యోగం రాకముందు నుండి వుద్యోగం ఇప్పించుకు పిల్లనిస్తామన్ని —కాదు —

కాదు, పిల్లనిచ్చి పెళ్ళిచేసి ఆ తర్వాతనే వుద్యోగం ఇప్పించు కొంటామని వెంటబడ్డారనుకో....మర్చేపోయా మా వాడి గురించి చెప్పనేలేదు కదూ! వాడి పేరు మధుసూదన్ - నామతి మరుపు మండిపోనూ నీ పేరేవిటి?" అన్నారు.

"మధుబాబు"

"వాడికీ నీకు వున్న తేడా బాబు, సూదన్‌ల దగ్గరే నన్న మాట. చాలా బాగుంది. నార్త్ ఇండియా-సౌత్ ఇండియా అన్నట్టు తేడా కొంచెమే" అంటూ నవ్వుతున్నవాడల్లా టక్కున ఆగి సీరియస్‌గా ముఖం పెట్టారు.

పక్కవాటాలో ఎవరో తెరలు తెరలుగా దగ్గలేక దగ్గుతున్న శబ్దం.

"వస్తాబాబు! మేముండేది ప్రక్కవాటాలోనే" అంటూ హడా విడిగా వెళ్ళిపోయారు.

రెండ్రోజులు ఆయన మళ్ళీ నాగదికేసి రానేలేదు. మూడో రోజు ఉత్తరం చేత బట్టుకొచ్చి నాకిస్తూ, "అబ్బాయి ఉత్తరం రాసి పట్టున్నాడు! కాస్త చదివి వినిపించుబాబు" అన్నారు.

తను చదువుకోగలిగి నన్ను చదవ మంటున్నారేవిటని ఆశ్చర్యపడుతూ సంకోచంతో ఉత్తరం అందుకొన్నాను.

"నిన్న సాయంత్రం నా కళ్ళజోడు షాపులో మర్చిపోయి న్నాను. అందుకే నిన్ను ఇబ్బంది పెట్టాల్సి వచ్చింది. ఇదేం ప్రేమలేఖ కాదుగా భయ పడటానికి, తండ్రికి కొడుకు రాసింది. ఫరవాలేదు చదువు" అన్నారు నవ్వేస్తూ.

"పూజ్యనీయులైన నాన్నగార్కి,

నమస్కారములు. ఇక్కడ వుద్యోగం బాగానే వుంది. ప్రస్తుతం ఓ చిన్నరూమ్ అద్దెకు తీసుకున్నాను. ఒంటరి తనంవలన అంతా కొత్తగా వుంది. మంచి ఇల్లు చూసి అమ్మను, నిన్నూ నా దగ్గరకే తీసుక రావాలను కొంటున్నాను. అమ్మ ఆరోగ్యం ఎలా వుంది? మంచి మందులు ఇప్పించి జాగ్రత్తగా చూడండి. మీ ఆరోగ్యంకూడా జాగ్రత్త. డబ్బు అవసరమైతే రాయండి.

ఇంతకన్నా విశేషాలులేవు.

—మధుసూదన్"

చదవడం ముగించి ఆయన ముఖంలోకి చూశాను. శూన్యంలో దృష్టి నిలిపి ఏకాగ్రతగా దేన్నో పరిశీలనగా చూస్తున్న ఆయన కళ్ళల్లో ఏదో మెరుపు.

ఉత్తరాన్ని మడిచి, "తీసుకోండి" అంటూ చేయి ముందుకు పెట్టాను. ఒక్కసారిగా ఏదో లోకాన్నుండి విసిరిపడ్డట్టు వులికి పాటుతో నాకేసి చూసి అంతలోనే నవ్వేస్తూ ఉత్తరాన్ని అందు కొని, "వాడ్నిగురించి నీకేం వివరాలు చెప్పలేదు కదూ! విశాఖ పట్నం షిప్పింగ్ యార్డ్‌లో మొన్నీ మధ్యనే ఇంజినీర్‌గా వుద్యోగం వచ్చింది. వాడికి మేమంటే చచ్చేప్రాణం అనుకో. వెళ్ళిన దగ్గర్నుండి మమ్మల్ని అక్కడికి తీసుకెళ్తానని ఒకటే గొడవ. నావంట్లో ఓపికున్నంత వరకు వాడి గుండెల మీద కూర్చో వటం దేనికి? ఆ తర్వాతంటావా, ఎటుదిరిగి వాడికి తప్పదనుకో! ఆ సంగతే రాద్దామనుకుంటున్నా, ఏ మంటావ్?" అన్నారు నాకేసి

చూస్తూ.

"పెద్దవారు! మీకన్నా నాకేం తెలుసు. మీకు తోచినట్లు రాయండి" అన్నాను.

"పిచ్చివెధవ! వాళ్ళమ్మ చేత్తో కలిపి పెడ్తేగాని వాడికి తృప్తివుండదు. ఏం తింటున్నాడో, ఏం చేస్తున్నాడో!" ఆయన కంఠంలో మాటలకందని ఎంతో ఆత్మీయత! "వాళ్ళమ్మకీ ఉత్తరం సంగతి చెప్పేవరకు మనసు కుదుట పడదు. నాల్రోజుల్నుండి ఒహటే గొడవ, అబ్బాయి దగ్గర్నుండి ఉత్తరం ఇంకా రాలేదని. వస్తాబాబు" అంటూ వెళ్ళిపోయారు.

ఆ తర్వాత మరో వారం రోజులకు చదవమంటూ మరో ఉత్తరం తెచ్చి నా చేతిలో వుంచారు.

"కళ్ళజోడు మళ్ళీ మర్చిపోయారా?" అన్నా నవ్వుతూ.

"అబ్బే! ఫ్రేమ్ పిన్ను వూడిపోతే వస్తూవస్తూ షాపులో పడేసి వచ్చాను. ఉత్తరాలు చదివి పెట్టినందుకు నేనేం లంచాలు ఇచ్చుకోలేను" అన్నారు నవ్వుతూ. ఉత్తరం చించి చదవటం ప్రారంభించాను.

"పూజ్యనీయులైన నాన్నగార్కి,

నమస్కారములు. మీరు రాసిన ఉత్తరం నిన్ననే అందినది. ఇక్కడకు రావడం ఇష్టంలేదని, వచ్చి నాకు భారం కాలేమని ఏమేమో రాశారు. ఉత్తరం చదివి నాలో నేనే మూగగా ఏడ్చాను. మీ కొడుకును కృతఘ్నుడిగా చెయ్యాలన్న దృఢ సంకల్పం వుంటే చెప్పండి. పుట్టిన నాటినుండి ఎంత ప్రేమగా,

ఆదరంగా నన్ను పెంచారో మర్చిపోలేడు. నా చదువుకోసం చాలీ చాలని జీతంతో ఇబ్బందిపడుతూ, అమ్మ ఆరోగ్యాన్ని అలక్ష్యం చేస్తూ నా భవిష్యత్తుకు మీ వెలుగును ఎంత హరింప జేసుకున్నారో నాకు తెలుసు. మీకు తన సేవలను అందించి జీవితాన్ని తరింప జేసుకోవాలని తపిస్తున్న కొడుకు బ్రతికి వున్నాడని తెలిసినంత వరకు అలాంటి ఆలోచనలు రానీకండి.

అమ్మకు మరీమరీ నమస్కారములు. ఆరోగ్యం జాగ్రత్త. సెలవు దొరికితే త్వరలోనే రావాలను కొంటున్నాను.

—మధుసూదన్."

ఆ ఉత్తరం చదువుతుంటే నాకంఠంలో ఏదో గాద్గదికం, కళ్ళల్లో మసక తెర చోటుచేసుకున్నాయి. నా ఆలోచన లెప్పుడూ నన్నుగురించి, నా భవిష్యత్ గురించి తప్పితే కన్న తల్లిదండ్రుల గురించి ఇంతగా ఎప్పుడైనా కేంద్రీకరించ బడేవా? మధుసూదన్ ముందు నేనెంతో సంకుచిత మనస్తత్వం గలవాడిగా అనిపిస్తుంది.

అతనో మేరు పర్వతం, నేనో రాతిగుట్ట.

ఉత్తరాన్ని మడిచి ఆయనకేసి చూశాను. అదేచూపు! అదే ఏకాగ్రత. కళ్ళల్లో తళతళ మెరుస్తున్న కన్నీరు.

"ఏమండీ!" అన్నాను మెల్లగా, ఉత్తరం ఆయన చేతిలో పెడ్తూ. వెంటనే తేరుకుని నవ్వేస్తూ, "చూశావా బాబు! వాడికి మే మంటే ఎంత ప్రేమో! ఉత్తరం వింటూ ఆనందంతో నన్ను నేనే మర్చిపోయాననుకో" అన్నారు కన్నీళ్ళు అద్దుకుంటూ.

"మధుసూదన్‌కు మీరంటే చాలా ప్రేమండీ."

"ఆఁ!.... అహహ.... అసలు చిన్నప్పట్నుండీ, ఒక్కడే కొడుకు అవటం వలన పువ్వుల్లో పెట్టి పెంచాం. వాళ్ళమ్మ వాణ్ని కన్నతర్వాత అసలు సన్ను పూర్తిగా మర్చిపోయిందనుకో. చిన్నతనంలో వాణ్ని - 'మా ఇద్దర్లో ఎవరంటే ఇష్టంరా' అంటే, ఏమనేవాడో తెల్సా?" ఆగిపోయారు నాకేసి చూస్తూ.

"చెప్పండి."

"అమ్మంటేనే ఇష్టం!" అనేవాడు "వెధవా! నేనంటే ఇష్టం లేదు?" అంటే "నువ్వంటే మరీ ఇష్టం" అంటూ లుంగలా చుట్టుకు పోయేవాడు వెధవ!"

ఆయన కళ్ళల్లో ఆనందం తాలూకు జలపాతం.

"వాడి మాటలు వింటూ ఎన్ని బాధలైనా మర్చిపోయే వాళ్ళం. నేను బాగా చదివి పెద్దవాడినైై ఇన్నేసి బిస్కట్లూ, చాక్లెట్లూ, ఇన్నేసి బట్టలూ కొనిపెడ్తా అనేవాడు. వెధవ! చదువులో ఎంత చురుకనుకొన్నావు? అన్ని క్లాసులు ఫస్ట్న పాసయ్యేవాడు." ఆనందంతో ఆయన ఏకధాటిగా చెప్పుకు పోతున్నారు.

పక్క వాటానుండి తెరలు తెరలుగా వినవస్తున్న దగ్గు. అంతలోనే ఆయన సీరియస్‌గా, "ఆనందంలో ఏవేవో వాగిసట్లున్నాను. వాళ్ళమ్మ ఆరోగ్యం అంత బావుండలేదు" అంటూ గబగబా బయటకు వెళ్ళారు.

ఓరోజు ఆఫీసుకు వెళ్దామని తయారవుతుండగా రామనాథం గారు ఆదుర్దాగా నాగదికి వచ్చారు. కళ్ళల్లో ఏదో దిగులు, నిద్రలేనట్లుగా పీక్కుపోయి పాలిపోయిన ముఖం.

"బాబూ ! నాకు కాస్త సహాయం చేసి పెట్టగలవా?" దీనంగా అడిగారు.

"ఏవిటో చెప్పండి !"

"..................................."

"అలా మొహమాట పడతారేమండీ! నేను మీ కొడుకులాంటి వాడ్ని .... డబ్బేమైనా కావాలా ?"

"ఆఁ....అహ....ఆఁ ! అవునుబాబూ! మా ఆవిడ ఆరోగ్యం బాగుండలేదు. రాత్రంతా కంటి మీద కునుకేలేదు. అబ్బాయి దగ్గ ర్నుండి ఇంకా డబ్బు రాలేదు. ఆస్పత్రికెళ్దామని - ఓ పాతిక రూపా యలుంటే ఇవ్వగలవా ?" అన్నారు మెల్లగా తలొంచుకొని.

"ఎంతమాట ! ప్రస్తుతం ఈ నలభై తీసుకోండి. అవసర మైతే మొహమాటం లేకుండా అడగండి. ఆస్పత్రికి నేనూ తోడు వస్తా పదండి." అన్నా డబ్బు ఆయన చేతిలో పెడ్తూ.

ఆయన కళ్ళతోనే నాకు కృతజ్ఞతలు చెప్పి, వాత్సల్యంగా చేయిపట్టుకొని, "నీ కెందుకు నాయనా శ్రమ. అంత భయం లేదు. రిక్షామీద నేనే ఆస్పత్రికి తీసుకెళ్ళగలను. నువ్వు ఆఫీసుకెళ్ళు. వస్తాబాబు !" అంటూ వెళ్ళిపోయారు.

మరుసటి రోజు ఆయన కనిపించిక పోయేసరికి సాయంత్రం ఆఫీసునుండి రాగానే మనసును అదుపులో పెట్టలేక నేనే పక్క-వాటాలోకి వెళ్ళాను.

తలొంచుకొని దిగాలుగా నేలకేసి చూస్తున్న రామనాధం గారు అడుగుల చప్పుడు విని తలెత్తిచూసి, "రాబాబు ? కూర్చో!"

అంటూ కుర్చీ చూపించారు.

"ఎలా వుందండీ ?" అన్నా మెల్లగా.

"సరోజా ! ఎవరొచ్చారో చూడు.... సరోజా !" అంటూ ఆమెకేసి వంగి పిలిచారు.

కర్రపుల్లలా వున్న శరీరం, రేగిన జుట్టు, ఎంతో వార్ధక్య మున్నట్లుగా ముఖం-చూస్తుంటే నాకెంతో బాధ వేసింది.

ఆమె మెల్లగా కళ్ళువిప్పి నాకేసి చూసిఎవరన్నట్లు ఆయన్ను చూసింది.

"అదేనే! మన ప్రక్కగదిలో వుండటంలా. మధుబాబని..." కొంచెం హెచ్చుస్థాయిలో చెప్పారు.

"ఎలా వుందండీ ?" అన్నా ఆప్యాయంగా.

"ఏదో... ఫర్వాలేదు. దగ్గు తగ్గింది. నువ్వు....మంచి.... ఆయన చెప్పారు." ఏదో మాట్లాడాలన్న తపన.

"మీరు ఎక్కువగా మాట్లాడకండి. విశ్రాంతి తీసుకోండి" అన్నా వారిస్తూ.ఆమె మౌనంగా నాకేసి చూస్తూ అలాగే మగతలోకి జారిపోయింది.

ఐదు నిముషాల పాటు అక్కడే వుండి ఆయనకు చెప్పి లేచి వచ్చేశాను. రాత్రి హోటల్లో భోజనం చేసి వస్తూ రొట్టెలు, ఫ్లాస్కుతో పాలు తీసుకెళ్ళాను.

"ఇప్పుడివన్నీ ఎందుకుబాబు ?" అన్నారు రామనాధంగారు

అభిమానంగా.

"మీ సేవకు ఈ మాత్రమైనా నన్ను అర్హుడ్ని కానివ్వండి. మీరూ ఈపూట భోజనం చేసేలా కనిపించలేదు. అందుకే తెచ్చాను, మరోలా భావించకండి" అంటూ అవన్నీ టేబుల్ మీదుంచాను.

ఇద్దరూ అవి తిని పాలుతాగేవరకు అడుగు బయటకు వెయ్య నని మొరాయించి ఇద్దరిచేత తినిపించాను. ప్రేమతో, వాత్సల్యంతో వాళ్ళు చూసిన చూపుల మధుర భావన ఎంత వెల ఇచ్చినా లభించ వేమో! ఏలోకానికి వెళ్ళినా అవి నన్ను వెంటాడుతూ దీవిస్తుంటా యనిపించింది.

"మధుసూదన్‌కు ఉత్తరం రాయమంటారా ?" అన్నా కాసే పాగి.

"అబ్బే! ఎందుకయ్యా! వాడసలే కంగారు మనిషి, సెలవుండో లేదో. ఆఫీసరు సెలవు లేదన్నా రాజీనామా ముఖాన కొట్టయినా వస్తాడు. రెండు రోజుల్లో అంతా సర్దుకొంటుంది. నిదానంగా నేనే రాస్తాను" అన్నారు.

ఆ తర్వాత వారం రోజుల్లో ఆమె ఆరోగ్యం కుదుటపడింది. ఓరోజు ఆయన డబ్బుతెచ్చి ఇవ్వబోయారు.

"ఫర్వాలేదు. ఉంచుకోండి. నిన్ననే నాకు జీతాలొచ్చాయి. డబ్బు గురించి నాకేం ఇబ్బందిలేదు" అంటూ అభ్యంతరం చెప్పాను.

"అలాగనకు బాబూ! కన్నకొడుకులా సమయానికి ఆదు కొన్నావు. ఈ రోజే అబ్బాయి డబ్బు పంపాడు. మరలా అవసర మొస్తే నిన్నే అడుగుతాను" అంటూ నవ్వి బలవంతంగా చేతిలో

వుంచారు.

"అయితే మీ కళ్ళజోడు ఈరోజు బాగుచేయించారన్న మాట" అన్నా నవ్వుతూ.

ఆయన ఫకాలున నవ్వి, "అబ్బే! అసలు వాడు ఉత్తరం రాయనేలేదు. కళ్ళజోడు బాగుచేయించు కొన్నానన్లే. అయినా వాడు రాసే ప్రతిదీ నువ్వు చదివి వినిపించందే నాకు తృప్తివుండదు. వచ్చేనెల వాడి పుట్టినరోజు. అందుకే తప్పకుండా రావాల్సిందని ఉత్తరం రాద్దామనుకొంటున్నా" అన్నారు.

"రమ్మని గట్టిగా రాయండి. నాకూ ఓసారి చూడాలనుంది."

"తప్పకుండా. నీ కోసం ఓ తమ్ముడ్ని సిద్ధంగా వుంచాను చూడ్డానికి అని మరీ రాస్తాను" అని నవ్వుతూ వెళ్ళిపోయారు.

ఓరోజు ఆయన ఎంతో ఉత్సాహంగా ఉత్తరం తెచ్చారు చదవమని, "కళ్ళజోడు పెట్టుకొచ్చానోయ్! అయినా నా షరతు నీకు ముందే చెప్పానుగా. చదూ త్వరగా" అంటూ తొందరచేశారు.

పెద్దగావిశేషాలేం లేవు-అమ్మ ఆరోగ్యం గురించి ఆదుర్దా-తన పుట్టిన రోజున రావటానికి తప్పక ప్రయత్నిస్తానని, ఆఫీసరుకు చెప్పానని రాశాడు. బహుశ ఇంతకుముందు ఉత్తరంలో నన్ను గురించి రాసేరేమో నాకు కృతజ్ఞతలంద జెయ్యమని మరీ మరీ రాసి ముగించాడు.

మరలా అదేచూపు- ఏకాగ్రత. ఆ ఉత్తరాన్ని అందుకొని ఆనందంగా వెళ్ళిపోయారు. ఆయనతోపాటు ఆ ఆనందాన్ని నేనూ అనుభవించాను, ఆ రోజెప్పుడు వస్తుందాని.

ఆ రోజైతే వచ్చిందిగాని మధుసూదన్ రానేలేదు. ఆరోజు ఉదయం ఆయన ఏదో పెరితిగా, పోగొట్టుకొన్న వాడిలా అటూ ఇటూ తిరిగేరు. క్షణంలో ఉత్సాహం - అంతలో నిర్లిప్తత-వెంటనే గంభీరత. ఆయన్ను చూస్తుంటే నాకెంతో బాధనిపించింది. మధుసూదన్ ఎందుకు రాలేదన్నది శేషప్రశ్నగా మిగిలింది.

ఆ రోజు మధుసూదన్ వస్తాడని నేనూ సెలవుపెట్టా. మధ్యాహ్నం అవుతుండగా దిగాలుగా రామనాథంగారు నా గదికి వచ్చారు. ముఖంలోని రక్తమంతా కళ్ళలో నిలిచిపోయిందా అన్నట్లు ఆయన కళ్లు ఎర్రబారాయి.

"బాబూ! వాడికి సెలవు దొరకలేదేమో! ఇక వస్తాడన్న ఆశకూడా లేదు. ఈపూట నువ్వు మా ఇంట్లోనే భోజనం చెయ్యాలి. మీ కోసం ఎన్నెన్నో వంటకాలు కష్టపడి చేసింది అమ్మ. వాడు రాని లోటు నీతోనైనా తీర్చుకునే భాగ్యం మాకు కలిగించు." కన్నీళ్ళతో నా చేతులు పట్టుకొన్నారు.

మారు మాట్లాడకుండా ఆయన వెంట నడిచాను. మధుసూదన్ లాంటి బిడ్డనుకన్న వీళ్లెంత అదృష్టవంతులు! కాదు-కాదు-ఇలాంటి తల్లిదండ్రులున్న మధే ఎంతో అదృష్టవంతుడు అనుకొన్నా అనేకసార్లు.

మధుసూదన్ రాలేదన్న దిగులు వాళ్ళకళ్ళలో కనిపిస్తుంటే నాకు సరిగా భోజనం చెయ్యాలనిపించక తలొంచుకొని వేళ్ళుపెట్టి కెలుకుతున్నాను.

"అదేవిటి బాబూ! సరిగా తినవేం? నిన్ను చూస్తుంటే

నాకు వాడే గుర్తొస్తున్నాడు. అచ్చు నీలానే కూర్చొని తింటాడు, మొద్దు వెధవ" అంది మెల్లగా నవ్వుతూ ఆమె.

"అబ్బే! సరిగానే తింటున్నానండీ! మీ దగ్గర నాకేం మొహ మాటం?" అన్నా బెరుగ్గానే.

"అబద్ధ మాడుతున్నావ్"అంటూ మరిన్ని వడ్డిస్తూ, "చూడు బాబు! మీ అమ్మే ప్రేమతో వడ్డిస్తే తినలేనంటావా? అదే మధు సూదన్‌కు ఈ అమ్మ వడ్డిస్తుంటే కాదంటాడా?" అంది ప్రేమగా.

"ఇదిగో మధూ! ఈరోజు నీరాత బాగుండలేదోయ్! అసలు కొడుకొస్తే ఈ ప్రేమ నీ మీద తగ్గి వాడిమీదకు పొయ్యేది. వాడు రాకపోవడం నీ దురదృష్టం. నువ్విప్పుడు ఇద్దరు మధుల తిండి తింటేగాని మా ఆవిడ విన్నొదల్దు" అంటూ ఫకాలున నవ్వి గొంతు కడ్డంపడి వుక్కిరి బిక్కిరై మంచి నీళ్లు గటగటా తాగేసేరు.

"మీరు మరీనూ! నీకెందుకు తినుబాబు. నాకలాంటి పక్ష పాతం లేదు. నాకు నువ్వైనా వాడైనా ఒకటే" అంటూ మళ్ళీ వడ్డించింది.

"అమ్మా!" నా కంఠం ఎందుకో వణికింది.

"ఏం బాబు!"

"జీవితంలో ఎప్పుడూ ఇంత ఆప్యాయంగా వడ్డించిన భోజనం చెయ్యలేదు. తల్లిదండ్రులందరికీ వున్నా ఇంత ప్రేమ నందించేవాళ్ళు అందరూ వుండరు. నువ్విలా పదిమంది భోజనం పెట్టినా....తినేస్తా" అన్నా ఏదో అనిర్వచనీయ భావంతో.

నా కళ్ళలో గిర్రున నీళ్లు– ఆమె కళ్ళలోనూ అదే సుడి.

"బావుంది. మీరిద్దరూ పోటీపడ్తే పడ్డారు గాని నా వాటా ప్రక్కన పెట్టు సరోజా! కావలిస్తే నీవాటా నీ కొడుక్కి తినబెట్టు" అంటూ ఫకాలున నవ్వేశారు.

ఆ రోజు రాత్రి నాకు వెంటనే నిద్రపట్టలా. అమ్మలాటి అమ్మవాళ్ళో తలదూర్చి కథలు చెప్తూ జో కొడుతుంటే వూకొడ్తూ యుగాలుగా నిద్రపోవాలని ఏవేవో వూహలు!

ఓ రోజు – గుంటూరు స్నేహితుడు గత మూడు నాల్గేళ్ళుగా వుద్యోగంలో ఇక్కడే స్థిరపడ్డ శివం హఠాత్తుగా వూడిపడ్డాడు.

"ఏవోయ్! హైద్రాబాద్‌లో వుంటూ నన్నే తప్పించుకు తిరుగుదామనుకొన్నావేవిటి? మొన్న గుంటూరు వెళ్తే మీ ఇంట్లో నీ గురించి చెప్పారు. అంతే. నిన్నవచ్చి ఈరోజు రెక్కలు గట్టుకొని నీ గూట్లో వాలాను" అన్నాడు భుజం బలంగా చరుస్తూ.

"సారీరా! ఏరోజు కారోజు గుంటూరు రాసి నీ అడ్రసు తెప్పించుకొందామను కొంటూనే అశ్రద్ధ చేశాను." సంజాయిషీ ఇచ్చుకొన్నాను.

"వ్యవహారం కేవలం సంజాయిషీతోనే తేలదు. కాఫీ టిఫిన్ లతో గాని సరిపోదు. అదిసరే! ప్రక్క వాటాలో రామనాధం అనే ఆయన వుంటున్నారుకదూ!" అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ.

"అవును! నీకెలా తెల్సు?"

"ఇంకా తెల్సు. ఆయనకు మధుసూదన్ అనే ఓ కొడుకున్నాడు. అతను విశాఖపట్నంలో వుద్యోగం చేస్తున్నాడు – ఇంజనీర్‌గా."

"కొంపదీసి నువ్వు జ్యోతిషశాస్త్రంలో పట్టా పుచ్చుకో లేదుగా?" అన్నా నవ్వి.

"చూడ్నాయనా! ఈదేశ ప్రజలు ఇంకా అజ్ఞానంలోనే మునిగి తేలాలని ప్రతిజ్ఞ చేసి, జ్యోతిష్యుడిగా నేనేం బోర్డు కట్ట లేదు" అన్నాడు విరగబడి నవ్వుతూ.

"ఇంకా చెప్పాలంటే, ఆ మధుసూదన్ రాసే ఉత్తరాలు ఆయన నీ చేతనే చదివించు కొంటారు. అతను ఇదిగో వస్తున్నానని రాసి అంతలోనే వీలుపడలేదని రాస్తుంటాడు. ఏమ్ ఐ కరెక్ట్" అన్నాడు.

నేనింకా ఆశ్చర్యంలో మునిగిపోయాను.

"అంతేకాదు. అతనలా రాయటమేగాని రాడు. అసలురాడు" అన్నాడు.

"నువ్వనేదేవిటి? నాకేం బోధపడటం లేదు. వివరంగా చెప్పు" అన్నాను దడదడలాడే గుండె వేగాన్ని అదుపులో వుంచు కోవాలన్న ప్రయత్నం చేస్తూ.

"ఇదే రూంలో నేనూ కొంతకాలం వున్నాను. నీలా నేను ఉత్తరాలు చదివి వినిపించాను. వాళ్ళ ప్రేమకు పులకించి మనసు లోనే నమస్కరించాను. ఎప్పుడో గాని నిజం నాకు తెలియలేదు." అన్నాడు కొంచెం సీరియస్‌గా.

"ఏమిటానిజం?" వాడి చేతులు నా చేతుల్లో బిగించాను.

"వివరంగా చెప్తాను. టీ తాగి అలా పబ్లిక్ గార్డెన్‌కు వెళదాం పద" అంటూ లేవదీశాడు.

పచ్చని పచ్చిక మీద కూర్చొని చెప్పడం ప్రారంభించాడు.
"మధుసూదన్ అనే కొడుకుండేవాడాయనకు. అన్నింట ఫస్ట్‌గా బి.ఇ. పూర్తి చేశాడు. అలా అనడం కన్నా ఆ తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి రక్తం ధారపోస్తే పూర్తి చేశాడనటం బాగుంటుంది. అటువంటి కొడుకును చూస్తే ఏ తల్లిదండ్రులకు గర్వంగావుండదు! తామంటే ప్రేమాభిమానాలు కురిపించే కొడుకు మీద ఏ తల్లిదండ్రులు ప్రాణం పెట్టుకు జీవించరు?" చెప్పుకుపోతున్నాడు.

"అసలు విషయం సూటిగా చెప్పు" అసహనంగా అన్నా నేను ఓర్చుకోలేక. "అందరిలా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజిలో నిరుద్యోగిగా రిజిస్ట్రేషన్ పొందాడు. నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా జీవితంలో స్థిరపడలేక నిరుద్యోగిగా స్థిరపడ్డాడు. రోజూ తల్లిదండ్రుల్ని చూసి అతను బాధపడటం, అతన్ని చూసి వీళ్ళు బాధపడటం. అప్లికేషన్ పెడ్తే విశాఖ షిప్పింగ్‌యార్డ్ నుండి ఇంటర్వ్యూకి పిలుపొచ్చింది." చెప్పటం ఆపి ఊపిరి పీల్చుకొన్నాడు.

"ఆ తర్వాతేమైంది ?"

"ఉద్యోగం ఇవ్వమని వుంటారు. కలత చెందిన మనసుతో సముద్రపొడ్డుకు వెళ్ళి వుంటాడు. ఆ కెరటాల్లా సంతోషంతో తుళ్ళి పడుతున్న మనుషుల్ని చూసి- వారిలా ఆనందాన్ని పొందలేని తన నిర్భాగ్య జీవితాన్ని బేరీజు వేసుకొనుంటాడు. చీకట్లో హోరు పెడ్తున్న సముద్రం 'ఓ నిరుద్యోగి! ఇన్ని ఆఫీసులు- కర్మాగారాలు నీకు చోటివ్వక పోయినా, నిన్ను అన్ని బాధలనుండి విముక్తి చెయ్యటానికి నేనున్నా రా రమ్మని' బంగాళాఖాతం చేతులు చాపి

వుంటుంది." వాడి కంఠంలోనూ జీర.

మసకబారిన నా కళ్ళకు పచ్చికంతా పులుముకు పోయినట్లుగా, గార్డెన్ గుండ్రంగా తిరుగుతున్నట్లుగా, నేనూ ఓ గడ్డితుంపునై నట్లుగా, ప్రక్కనే రోడ్డు మీదెళ్తున్న వాహనాలు సమస్యల హోర ష్లతో గగ్గోలు పెడుతున్నట్లుగా, తల గిర్రున తిరుగుతుంది.

"అయితే, ఆ ఉత్తరాలెవరు రాస్తున్నారు ?" అన్నాను కాసేపాగి.

"ఆయన స్వయంగా రాసి, తన అడ్రసుకే పోస్ట్ చేసుకొని వాటిని నీచేత చదివించి తృప్తి పడుతుంటాడు. కవరు పరిశీలించి వుంటే నీకే తెలిసేది. తన కొడుకు లేడని తెలిసినా వున్నాడన్న భ్రమతో తృప్తిని వెదుక్కొంటుంటాడు. తనకొడుకు ఈడున్న కుర్రవాళ్ళలో తమ కొడుకును చూసుకొంటూ తృప్తిపడుతుంటారు వృద్ధ దంపతులు. తమ ప్రేమ పూరిత హస్తాల్లో ఇతరుల్ని కౌగి లించుకు తృప్తిపడుతుంటారు. ఇదీ క్లుప్తంగా వాళ్ళకథ." అంటూ ముగించి మరో సిగరెట్ వెలిగించాడు బాధను పొగరూపంలో వెలు పలకు వదలాలన్నట్లుగా.

ఆ తర్వాత చాలా సేపు మూగగా అక్కడే వుండిపోయాం.

"పరిశీలిస్తూ పోతే ఈ సృష్టిలో ఇలాంటి కథలు ఎన్నో వుంటాయి. ప్రతి సమస్య చుట్టూ ఓ కథ- లేదా అనేక కథలు- భగ్గున మండిపోయిన అనేక జీవితాలు. వాటికి మనం సానుభూతి

చూపించటం తప్పితే ఏమీ చెయ్యలేని నిస్సహాయులం. వీటికెవరు కారణం ? అంటే- అవి చిక్కు ప్రశ్నలు" అంటూ లేచాడు.

ఆరోజు రాత్రి నాకు నిద్రపట్టలేదు. వాళ్ళిద్దరి మనస్తత్త్వాన్ని ఎంత అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నా, ఇంకెంతో అర్థం జేసుకోవాల్సింది, ఎంతో కొంత మిగులుతున్నట్లే వుంది. రాత్రి కన్నీటి ప్రవాహంలా నా కళ్ళ నుండి జాలువారింది.

ఆరోజు ఆయన మరో ఉత్తరం చేతబట్టుకొని గదిలోకి అడుగుపెట్టేసరికి నాలో చిన్న వణుకు! నిజానిజాలు ఇద్దరకూ తెల్సినా, తెలియనట్లే నటిస్తున్న మా ఇద్దరిమధ్య సాగిపోయే ఈ కథ సశేషమైనది.

(చక్రవర్తి, డిశంబర్ 1978)